


# బిచ్చగాళ్ళు

కొటూరు రవీంద్ర - త్రివిక్రమ్

సర్వర్ కాఫీతెచ్చి ఎదురుగా ఉంచగానే, నిరీక్షణలోని విసుగు పారిపోయింది. మాధవరావ్ ఆప్యాయంగా కాఫీని 'సిప్' చెయ్యసాగాడు.

ఆ రోజే జీతాలందాయి;

మాధవరావ్ ఎప్పుడొచ్చినా రాకపోయినా, జీతాలందిన రోజున మాత్రం తప్పకుండా వస్తాడు.

పెళ్లికాకముందు, జీవితం కలల పడవలా వయ్యారాలుపోతూ పయనిస్తున్నపుడు రోజుకి రెండుమాట్లు కూడా వచ్చేవాడు.

కానీ–ఇప్పుడది సాధ్యంకావటంలేదు.

పెళ్లికథకి ఉపకథలుగా సమస్యలుంటాయి.

సమస్యల మధ్య సరదాలు ఎండిపోతాయి. తీరుకునే లోగానే జీవితం ఎండిపోతుంది!

అప్రయత్నంగా గోడకేసి చూశాడు.

ఆ రోజుతో జీవితం చాలించే పాత క్యాలెండరు!

తెల్లవారితే క్రొత్త సంవత్సరం. పరిసరాల పాతదనం మధ్య ఊహల కొత్తదనం– క్రొత్త చిగుళ్లు తొడిగే ఆశలు.

మాధవరావ్‌కి నవ్వొచ్చింది.

ప్రపంచానికి నిర్వచనం— 'ఆశాపాశాలు' అని చెబితే బాలనిపించిందతనికి.

కాఫీ తాగటం అయిపోయింది. కప్పు బల్లమీద ఉంచేశాడు. బిల్లుకోసం నిరీక్షిస్తుంటే ఇల్లు గుర్తొచ్చింది.

ఇల్లుతోబాటు ఇల్లాలు!

అదేమి తమాషానో— భార్య భారతి పెళ్లైన తొలిరోజుల్లో యిచ్చిన కాఫీలా యిప్పుడు ఉండటంలేదు.

ఆ రోజుల్లో అవిడ ముగ్ధ!

మెరిసే కళ్లతో, మురిపించే నవ్వుల్తో ఏమిటో అవన్నీ ఎమైపోయాయొ యిప్పుడు!

"ఎక్స్క్యూజ్‌మీ సర్...." ఉలిక్కిపడి ప్రస్తుతంలోకి వచ్చాడు మాధవరావ్.

ఎదురుగా కుర్చీలో ఎవరో అపరిచిత వ్యక్తి!

కష్టాల్లో ఉన్న హీరోలా దీనంగా ఉన్నాడు.

"యస్ ప్లీజ్ ..." అన్నాడు అర్థం గానట్లు చూస్తు మాధవరావ్.

"అ యామ్ ఏ పోస్టుగ్రాడ్యుఏట్ యిన్ సర్చ్ అఫే జాబ్...." తడారిపోతున్న పెదవుల్ని మళ్లీ తడుపుకుంటూ అన్నాడు.

"సో ??" అన్నాడు చివరి సిప్ తీసుకుని సాసరు కిందపెట్టూ మాధవరావు.

"అయామ్ స్టార్వింగ్ ఫర్ ది లాస్ట్ త్రీడేస్...." అతని కళ్లలో అభ్యర్థన కన్పించింది.

అంతలో 'సర్వరు' వచ్చి టేబుల్ మీద బిల్‌పెట్టి, నిరుద్యోగి కేసి నిరసనగా, తిరస్కారంగా చూస్తూ వెళ్లిపోయేడు.

అంటే అంతకు మునుపే అతని గురించి 'సర్వర్'కి తెలుసునని అర్థం చేసుకున్నారు మాధవరావ్.

క్షణం ఆలోచించి జేబులోంచి రూపాయి కాయితం తీసాడు.

అతని కళ్లలో ఆశ మెరిసింది.

"థేంకిట్!" అంటు టేబుల్‌మీద వదేసాడు.

అతను కృతజ్ఞతతో కరిగిపోతు "థ్యాంక్యూ.... థ్యాంక్యూ వెరీమచ్ సర్...." అంటూ చటుక్కున జేబులో పెట్టుకున్నాడు.

"చూడు మిస్టర్! నీ పేరేమిటో నాకవసరం లేదు. కానీ - ఒక్క మాట చెప్పదల్చుకున్నాను. అడుక్కోవటానికి ఎమ్మే డిగ్రీ అవసరం లేదు. తెలుగు మనుషులముందు ఇంగ్లీషు మాట్లాడే అవసరం అంతకన్నా లేదు. చెప్పేదేదో తెలుగులో చెప్పి ముష్టి అడగొచ్చు .." చకచకా కౌంటరువైపు అడుగులు వేసాడు.

అతని మొహం వివర్ణమవటం మాధవరావ్ గమనించకపోలేదు. గర్వంగా నవ్వుకున్నాడు. అంతలో కాస్త జాలి కూడా వేసింది.

ఒక మంచిపని చేసిన 'రిలీఫ్' అను



భవించాడతను. "ఈ దెబ్బతో అతను మారితీరాలి" చిల్లర తీసుకుని బయటకు నడిచాడు.

బడ్డీకొట్లో సిగరెట్ పెట్టె అగ్గిపెట్టె, ఓ వక్కపొడి పొట్లం కొన్నాడు. సిగరెట్ వెలిగించుకుని, వక్కపొడి నోట్లో వేసుకున్నాడు. 'ఎక్కడికి వెళ్ళటమా' అని ఆలోచిస్తూండిపోయేడు.

ఇదంతా ఓపిగ్గా చూస్తున్న ఓ ముష్టి కుర్రాడు ముందుకొచ్చి "సార్ – ఒక సిగరెట్టివ్వండి సార్... రోజూ ఎంగిలి పీకలు తాగి, తాగి విసుగెత్తింది" అనడిగేడు.

మాధవరావ్ వాడి మొహంకేసి చూసేడు, ఆశ్చర్యంగా.

ఆశ – నిరాశలమధ్య ఉన్నాడు వాడు. రెండింటికీ అలవాటుపడ్డ మనిషిలా కన్పిస్తున్నాడు.

"సిగరెట్టు బదులు పదిపైసలిస్తే ఏం చేస్తావ్?" ఎక్స్‌పెరిమెంట్ చేసేవాడిలా అడిగేడు.

వాడు విబ్బరం చూస్తూ "ఓ సిగరెట్ కొనుక్కుంటా సార్" అన్నాడు

ఆ జవాబు కొత్త చిరుకుర్ర మన్నిం చినా, వాడి నిజాయితీ ఆనందం కలిగించింది.

జేబులోంచి సిగిరెట్ తీసి "ఇలా నీకిచ్చినట్లు నీ మిత్రులందరికీ చెప్పవనీ మళ్ళీ నేను కనిపించినప్పుడల్లా అడగ నంటే ఇస్తా" నన్నాడు.

వాడికతని మాటలు వెంటనే అర్థంకాలా.

అర్థమయ్యాక నవ్వుతూ "అలాగే సార్!" అన్నాడు.

వెంటనే మాధవరావ్ సిగరెట్ వాడి చేతిలో పెట్టి సాగిపోయాడు.

* * *

ఆఫీసంతా సందడిగా ఉంది.

ఎలాంటి సందడంటే— ఎన్నో ఏళ్ళ గతచరిత్రతో వార్థక్యంలోకి అడుగెట్టిన గోడలు, ఫర్నిచరూ వయసు మేకప్ వేసుకున్న ముసలితారల్లా మెరిసి పోతున్నాయ్.

ప్రతి టేబుల్ మీదా అడ్డదిడ్డంగా పడి ఉండే ఫైల్సన్నీ నయనానందకరంగా సర్దిఉన్నాయి.

ఇంతకీ విశేషమేమంటే ఆ రోజు— ఇనస్పెక్షన్.

అదికూడా శేషగిరిరావ్‌గారి ఇనస్పె క్షన్. ఆయన్ని 'ఇనీషియల్స్' తో కలిపి 'ఎమ్. వి. ఎస్. గిరి' అని లేక ఒట్టి 'ఎమ్వీయస్' అనిగానీ పిలవటం కద్దు. ఆయన ఎక్స్ డిఫెన్స్ మనిషి.

పర్సనాలిటీ ఆరడుగులు.

అందంతో పోటీపడే చురుకుదనం, చమత్కారం, తెలివితేటలూ ఆయన సొత్తు!


ఆయనొస్తున్నాడంటే ఆఫీసుకి కాయ కల్పచికిత్స జరుగుతుంది. ఆయనకి నచ్చినవాళ్ళకి వారంలోగా ప్రమోషను— నచ్చనివాళ్ళకి అదే వ్యవధిలో డిమోషన్ ప్లస్ ట్రాన్స్‌ఫరూ ఖాయం!

ఎవర్ని ఎలా చదవాలో ఆయనకి తెలుసు. ఆయనవి ఎక్స్‌రే కళ్ళు. మనసు లోకి తొంగిచూసి, ఇష్టే దొంగల్ని పసి కట్టెయ్యగలడు. ఎటొచ్చీ నిజాయితీకి ఆయన లొంగిపోతాడు. ఎంత కఠిన మనిషో అంత క్షమాగుణం ఉంది.

అలాంటి శేషగిరిరావు, గడియారాలు తనని చూసి సిగ్గుపడేలా టంచన్‌గా మిల్లీ సెకండ్లతో సహా వచ్చేశాడు. అలా వచ్చే స్తాడు గనకే లేటుకమ్మర్స్‌కది ప్రాణ గండం. ఆలస్యమైతే శలవు పెట్టేస్తారు గానీ, ఆయనకెదురుగా రారు....

రారన్న సంగతి ఆయన కూడా తెలుసు.

అందుకే లీవ్‌లెటర్లు అడిగి తెప్పించు కుని చూస్తాడు. ఎవరు తనని తప్పించు కునేందుకు సిల్లీకారణాలు రాసిందీ గమ నించి, డైరీలో వాళ్ళపేర్లు రాసుకుంటాడు. అవి రాసుకోవటం కేవలం వాళ్ళ ప్రవ ర్తనాసరళిని ముందు ముందు అంచనా వేయటానికే! తన ఇనస్పెక్షన్‌కి వరసగా




ఎగ్గొట్టినవాళ్ళని ఎంచి అప్పుడు వాళ్ళకి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ పెడతాడు.

వాళ్ళ జవాబులుబట్టి అతని 'రిమార్క్స్' ఉంటాయి.

మాధవరావ్‌కి రావాల్సిన ప్రమోషన్ రెండుసార్లు తప్పిపోయింది. అతని జూనియర్లకొచ్చింది. వాళ్ళు ఆఫీసర్లయి హాయిగా బదిలీలయిపోయి కాలక్షేపం చేస్తున్నారు. అతను మాత్రం ఆఫీసుతో బాటు వయసు పెంచుకుంటున్నాడు.

ఈమాటు అతను శేషగిరిరావ్‌గార్ని ఏకాంతంలో కలుసుకుని తన బాధలు చెప్పుకోదలిచాడు. నిజంగా అతని ఇంటి పరిస్థితి ప్రోత్సాహకరంగా లేదు. లేనంతలో ఆఫీసు దగ్గరకెళ్ళి తనగోడు చెప్పుకోవాలని ఎక్కడా లేదు. కానీ, చెప్పకపోతే, అతను అలాగే ఎదుగు బొదుగు లేకుండా ఉండిపోయేట్లున్నాడు.

అప్పటికీ ప్రతి ఇనస్పెక్షన్ టైములోను శేషగిరిరావ్‌గారి దృష్టిలో పడేందుకు శాయశక్తులా కృషిచేస్తూనే వచ్చాడు. కానయితే ఇంకా ఆయన కరుణాకటాక్ష వీక్షణాలు ప్రసరించలేదు. అందుకే ఈ మాటు తెగించదలిచాడు.

అతి ప్రయత్నంమీద శేషగిరిరావ్ గార్ని ఏకాంతంలో కలుసుకోగలిగాడు.

మాధవరావ్ చెప్పినదంతా ఏభావమూ ప్రదర్శించకుండా, మౌనంగా చివరిదాకా విన్నాడు శేషగిరిరావుగారు. చివరికి ఎదురుగా ఉన్న నీళ్ళగ్లాసు ఖాళీచేసి, 'కాలింగ్‌బెల్' నొక్కాడు.

అటెండర్ నాంచారయ్య పరుగున వొచ్చాడు.

అతి వినయంగా ముందుకు వంగి— "సార్" అన్నాడు.

"ఉదయం ఏమిటీ అడుగుతున్నావ్?" అన్నాడు శాంతంగా.

"అదే బాబూ! మా పెద్దోడు టెంత్ పాసయ్యాడండీ అద్ని తమరే దయ సూడాల. ఏదో మీ కాళ్లకాడ బతికే వోళ్లం.. నాలాంటి పనుల్లో ఏస్తే సాలు బాబు ఈ ఏడాది పెళ్లిసేద్దారనుంది బాబయ్యా." ప్రతి డైలాగుకీ ఒక ఎక్స్ప్రెషన్ ఇస్తూ ముగించాడు నాంచారయ్య

"వాట్ షల్ ఉయ్‌డూ విత్ దిఫెలో మిస్టర్ రావ్?"

మాధవరావు ఉలిక్కిపడి చూశాడు. అది ఆశించని ప్రశ్న.

"సర్ " అన్నాడు ఏంచెప్పాలో తెలీని అయోమయంలో తబ్బిబ్బవుతూ.

"సపోజ్ యూ ఆర్ ఇన్ మై సాక్స్"

మాధవరావుకి గుటకమింగటం కష్టమనిపించింది. శేషగిరిరావు అతని అవస్థని గ్రహించి, నాంచారయ్యని బయటికి పంపేసాడు.

"చూడు మాధవరావు! నువ్వు నన్ను ప్రమోషన్ అడిగిన పద్ధతికీ, నాంచారయ్య కొడుక్కి ఉద్యోగం అడిగిన పద్ధతికీ, మనం బయట కడుగుపెట్టగానే 'బాబూ' అంటూ చెయ్యిజాచి వెంటపడే వాడి పద్ధతికీ పోలికలున్నాయనిపిస్తోందికదూ?"

మాధవరావు మొహం ఎర్రబడింది.

"నిన్ను అవమానం చెయ్యడానికి ఈ ప్రశ్న వెయ్యలేదు. మనిషిలో ఉండే బలహీనతల సంగతి చెబుతున్నానంతే. బిచ్చగాడికి చెయ్యిజాచి అర్థించే అర్హత ఉన్నట్లే, నాంచారయ్యకి ప్రాధేయపడి కొడుక్కి ఉద్యోగం తెప్పించుకునే అర్హత కూడా ఉంది. సంఘంలో వాళ్ల స్థాయి అంతే. కానీ, నువ్వు వాళ్లతో సమంగా అడిగావంటే— రియల్లీ పిటీ! నువ్వు నీ స్థాయినుండీ ఎన్ని మెట్లు దిగివచ్చావో నువ్వే అర్థంచేసుకో. ప్రమోషన్ ఇస్తే నువ్వు ఆఫీసరు వవుతావు. కానీ, నీలో ఈ బలహీనత పోనంత కాలం నీస్థాయి నిలబెట్టుకోలేవు. నీ ఉద్యోగధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించలేవు. అందువల్ల— నువ్వు అడగక ముందు ఇద్దామనుకున్న ప్రమోషన్‌ని ఈ క్షణంలో వాయిదావేయక తప్పటంలేదు. విష్ యూ బెస్టాఫ్‌లక్ నెక్స్ట్ టైమ్."

